సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 23 । మార్చి । 2025




భక్తుల రద్దీ నామమాత్రం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శని వారం భక్తుల రద్దీ నామమాత్రంగా ఉంది. **పదో తరగతి పరీక్షలు, అష్టమి తిథి కావడంతో భక్తుల రాక తక్కువగా ఉంది.**



నిషేధిత మందుల అమ్మకాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిషేధిత మందుల విక్రయాలపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఏకకాలంలో దాడులు చేశారు. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.21	4.45
నరసాపురం	6.21	4.42
తాడేపల్లిగూడెం	6.16	4.53

న్యూస్‌రీల్

మున్సిపల్ ఆర్‌ఐలకు కొత్త కంప్యూటర్లు



సాక్షి స్పందన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపల్ రెవెన్యూ కార్యాలయంలో పాత ఫర్నిచర్, పనిచేయని కంప్యూటర్లతో ఆర్‌ఐలు ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి స్పందించారు. రెవెన్యూ విభాగానికి మూడు కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేశారు. తమ ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిన 'సాక్షి'కి రెవెన్యూ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేడ్-1 మున్సిపాలిటీ, ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉన్నా భీమవరంలో సౌకర్యాల కొరత వేధిస్తోంది.

టెన్త్ పరీక్షలకు 99 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన ప్రథమ భాష పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1కు 99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. 4,163 మంది విద్యార్థులకు 4,132 మంది హాజరయ్యారన్నారు. 39 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని నారాయణ తెలిపారు.

మద్యం షాపు ఏర్పాటుపై మండిపాటు



మద్యం షాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

నరసాపురం: నరసాపురంలోని 26వ వార్డు వీవర్స్ కాలనీలో మద్యం షాపు ఏర్పాటును శనివారం స్థానికులు అడ్డుకున్నారు. కల్లుగీత కార్మికుల కోటాలో షాపును వీవర్స్ కాలనీలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసే యత్నం చేశారు. షాపును ప్రారంభానికి సిద్ధం చేస్తుండగా స్థానిక మహిళలు అడ్డుకున్నారు. కాలనీలో ఇళ్ల మధ్య బ్రాందీ షాపు పెడితే ఎలాగని ప్రశ్నించారు. కాలనీలో రోడ్డుపై మహిళలు తిరగలేరని, చిన్న పిల్లలు ఆడుకునే గ్రౌండ్ వద్ద షాపు ఎలా పెడతారని నిలదీశారు. మహిళల ఆందోళనతో నిర్వాహకులు షాపు ఏర్పాటు నిర్ణయాన్ని వాయిదా వేసుకుని వెళ్లిపోయారు.

బెల్టు షాపులను అరికట్టలేని ప్రభుత్వం



మాట్లాడుతున్న నర్సింహమూర్తి

భీమవరం: రాష్ట్రంలో బెల్టుషాపులను అరికట్టలేని కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి దుయ్యబట్టారు. శనివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కల్లుగీత సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 70 వేలకుపైగా బెల్టుషాపులు ఉన్నాయని, గోవా, యానాం నుంచి అక్రమ మద్యం వస్తుండటంతో తాటి కల్లు ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో గీత కార్మికుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు. కల్లు గీత వృత్తిలో మార్పు తెచ్చి గీత కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతోనే బెల్ట్ షాపులు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ బెల్ట్ షాపులు, అక్రమ మద్యం అరికట్టలేని ఎక్సైజ్‌శాఖ గీత కార్మికుల ఇళ్లపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఉంగుటూరు: కాగుపాడు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై రెండోసారి శనివారం విచారణ జరిగింది. నూజివీడు డీఎల్‌పీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ విచారణ చేయగా ఆరోపణలకు బాధ్యులు సర్పంచ్ కడియాల సుదీప్త, కార్యదర్శి, దుర్గాధర్, పూర్వ కార్యదర్శులు బాలకృష్ణ, శ్రీదేవి, ఆరోపణలు చేసిన వార్డు సభ్యులు హాజరయ్యారు. కార్యదర్శి బాలకృష్ణ రూ.1.42 లక్షలు, కార్యదర్శి శ్రీదేవి రూ.6.35 లక్షలు, సర్పంచి సుదీప్త రూ.7.77 లక్షల నిధులు దుర్వినియోగం చేసినట్లు నోటీసులో తెలిపారు.

మనసున మనసై..

- వారాంతాల్లో విరామంతో ఇల్లాలికి ఉపశమనం
- ఇంటి పనుల్లో భర్త భాగస్వామ్యం అవసరం
- ఇద్దరి మధ్య బలమైన బంధానికి పునాది
- వర్క్ షేరింగ్.. హ్యాపీనెస్ లోడింగ్ అంటున్న మానసిక నిపుణులు

ఆదివారం.. ఆమె కోసం..

సండే స్పెషల్

రోజంతా బండెడు చాకిరీ చేసే భార్యకు ఇంటి పనిలో భర్త చేసే చిన్నపాటి సాయం ఎంతో ఉపశమనాన్నిస్తుంది. లేచింది మొదలు పడుకునే వరకు అలుపెరుగని ఆమె శ్రమకు వారంలో ఒక్కరోజైనా విరామం అవసరం. ఆదివారం భర్త ఇంటి పనులు చక్కబెడుతూ ఆమెను మురిపిస్తే వారి సంసార బంధం మరింత బలపడుతుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.





సాక్షి, భీమవరం: తెల్లారి లేచింది మొదలు ఆడవాళ్ల చేతులు పనులకు ముడిపడతాయి. ఇంటిని శుభ్రం చేయడం, పిల్లలకు స్నానాలు చేయించడం, భర్త, పిల్లలు రెడీ అయ్యేసరికి టిఫిన్లు సిద్ధం చేసి పెట్టడం. అవి పూర్తయ్యేలోగా లంచ్ బాక్స్‌లు ప్యాకింగ్. ఇలా.. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు క్షణక్షణం ఉరుకులు పరుగుల జీవితం. భర్తను ఉద్యోగానికి, పిల్లల్ని బడికి సాగనంపాక బండెడు గిన్నులు తోముకుని, ఇంటిల్లపాదివి మాసిన దుస్తులు ఉతుక్కుని, స్నానం చేసి దేవుడికి దణ్ణం పెట్టుకుని.. హమ్మయ్యా అనుకునేసరికి టైం 11 అయిపోతుంది. చాలామంది గృహిణులు ప్రశాంతంగా కూర్చుని టిఫిన్ చేసేది అప్పుడే. సాయంత్రం పిల్లలు, భర్త ఇంటికి తిరిగి వచ్చే వరకు ఏదో పనిలో ఈదుతూనే ఉంటారు. పిల్లలతో హోం వర్క్ చేయించి రాత్రి అందరూ పడుకున్నాక ఉదయానికి అన్నీ సర్దుకుని అలసిసొలసి అప్పుడు నిద్రలోకి జారుకుంటుంటారు.

ఏమేం చేయాలంటే..



- ఉదయం లేవగానే గదులను తుడవడం, దుమ్ములు దులిపి ఇంటిని శుభ్రం చేయడం. ఇంటి ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించడం, మొక్కలకు నీరు పెట్టడం. గిన్నెలు తోమడం, కూరగాయలు కోయడం, వంట చేయడం. దుస్తులు ఉతికి ఆరబెట్టడం, ఐరెన్ చేయడం
- పిల్లలు ఇంటి వద్దనే ఉంటారు కాబట్టి వారికి స్నానాలు చేయించడం, హోంవర్క్‌లో సాయం చేయడం, వారితో కలిసి సరదాగా ఆడుకోవడం వంటివి భర్తలు చేస్తుండాలి.

కుటుంబానికి చేదోడుగా..

భర్త, పిల్లల్ని సాగనంపి కుటుంబ పోషణకు చేదోడుగా ఉద్యోగాలు, పనులు చేస్తున్న మహిళలు ఎందరో ఉన్నారు. వీరిపై పనిభారం మరింత ఎక్కువగా ఉంటుంది. దాదాపు ప్రతి ఇంటిలో తొలి మేలుకొలుపు భార్యదే. రాత్రి బాగా పొద్దిపోయాక నిద్రపోయేది ఆమెనే. పనుల సుడిగుండంలో తనను తాను మరిచిపోయి ఎల్లప్పుడూ కుటుంబ క్షేమం కోరే వ్యక్తి ఇల్లాలు. అలాంటి అర్ధాంగికి ఉపశమనం కలిగించేలా వారాంతాలు, ముఖ్యంగా ఆదివారం ఇంటి పనుల్లో భర్త సహాయం చేయడం ద్వారా గృహిణుల మానసిక, శారీరక స్థితులు మరింత దృఢమవుతాయని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. గృహ సంబంధ బాధ్యతలు పంచుకోవడం మేలని, ఈ దిశగా అందరూ ముందుండాలని అంటున్నారు.

ప్రయోజనాలెన్నో..

- **ఇంటిపనిలో చేదోడువాదోడుగా ఉండే భర్తని ఇల్లాలు చాలా ఎక్కువగా ప్రేమిస్తుం**దని నిపుణులు అంటున్నారు. భర్త తనను ఎంత ప్రేమగా, బాధ్యతగా చూసుకుంటున్నాడో అర్థం చేసుకుంటుంది. ఇద్దరి మధ్య ఏమైనా మనస్పర్థలు, అపార్థాలు ఉంటే తొలగిపోతాయి. ఆదివారం వర్క్ షేరింగ్‌తో ఆ ఇంట హ్యాపీనెస్ లోడింగ్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు.
- ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారు. విశ్రాంతి వలన ఆమె శారీరక, మానసిక స్థితి మెరుగుపడుతుంది.
- ఇంటి పనులు త్వరగా పూర్తయితే ఇద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకునేందుకు సమయం పెరుగుతుంది.
- సెలవురోజున పని అయ్యాక ఇల్లాలని సరదాగా బయటకు తీసుకువెళ్లడం వలన వారికి రీఫ్రెష్ అయిన భావన కలిగి వారమంతా ఉత్సాహంగా ఉండే వీలుంటుంది.
- ఇల్లాలు భర్త నుంచి కొంత సమయం కోరుకుంటుంది. అది కూడా స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని భావిస్తుంది. ప్రేమగా వారి పనుల్లో పాలుపంచుకోవడం వలన ఇది సాధ్యపడుతుంది.
- ఇంటి పని మహిళలే చేయాలన్న భావన నుంచి బయటపడొచ్చు.

భార్యకు విశ్రాంతి అవసరం



భార్యకు ఒక్కరోజు విశ్రాంతిని వ్వడం ఎంతో అవసరం. పని ఒత్తిడి నుంచి వారికి ఉపశమనం కలుగుతుంది. వారిని పట్టించుకోనట్టు ఉంటేనే ఆడ **వారికి అలకలు, కో**పాలు వస్తాయి. భర్త ఇంటి **పనుల్లో కలుగజేసుకు**ని భార్యకు చేసే సాయం వారి **బంధానికి మరింత** బలమవుతుంది. కౌన్సెలింగ్‌లో **భార్యాభర్తలకు ఈ** విషయాన్ని చెబుతుంటాం.

– **చల్లా భారతిదేవి**, సైకియాట్రిస్ట్, పాలకొల్లు

ఆయనకు సెలవొస్తే..



మా వారు పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగి. ఆదివారం, సెలవు రోజుల్లో ఇంటి వద్ద వంట పని, ఇంటి పనుల్లో సాయం చేస్తుంటారు. నా కష్టాన్ని అర్థం చేసుకునే మనస్తత్వం ఆయనకు ఉందని సంతోషం, సంతృప్తి కలుగుతుంటాయి. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి నా భర్త సహకారమే కారణం.

– అంబటి అరుణ సూర్యకుమారి, గృహిణి, నరసాపురం

తప్పనిసరిగా సహకరించాలి



ఇంటి, వంట పనుల్లో భార్యకు తప్పనిసరిగా సహకరించాలి. నేను వ్యాపారరీత్యా ఆరు రోజులు షాపులో ఉన్నా ఆదివారం తప్పనిసరిగా ఇంటి పనుల్లో నా భార్య లక్ష్మీకుమారికి సహాయపడతాను. ఇతర రోజుల్లోనూ ఇతర పనుల్లో సహాయం చేస్తా. భార్యలకు సాయం చేయడం బాధ్యతగా భావించాలి తప్ప నామోషీగా ఫీల్ కాకూడదు.

– కారుమూరి నర్సింహమూర్తి (బాబు), భీమవరం

ఇంటి పనుల్లో సాయపడతాను



నేను ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడిని. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇంటి కోసం కష్టపడే నా సతీమణి కోసం ఆదివారం ఇంటి పనుల్లో సాయపడతాను. అప్పుడు తెలుస్తుంది ఇంటిని చక్కబెట్టేందుకు ఆవిడ ఎంత కష్టపడుతుందోనని. పొద్దస్తమాను పనిచేసే మహిళలకు వారంలో ఒక రోజు విశ్రాంతి అవసరం.

– పొద్పోకు గజేంద్ర గడ్కర్, ఉపాధ్యాయుడు, రాయకుదురు

ఆ చిన్నారుల చదువుకు
వీధి లైట్లే దిక్కు

- ఇళ్ల తొలగింపుతో రోడ్డున పడ్డ బాధితులు
- పట్టాలిచ్చినా కట్టుకునే స్థోమత లేక అవస్థలు
- దయ చూపండని బాధితులు, పిల్లల మొర



దయ చూపాలని వేడుకుంటున్న చిన్నారులు



వీధి దీపాల కింద చదువుకుంటున్న చిన్నారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆకివీడులోని అమృతరావు కాలనీకి చేర్చి శ్మశాన భూమికి మధ్య ఆక్రమణలను తొలగించడంతో బాధితులు వీధిన పడ్డారు. వారి పిల్లలు వీధి దీపాల కింద చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. 30 ఏళ్లుగా శ్మశానానికి ఆనుకుని పూరి పాకలు, పందిళ్లు వేసుకుని సుమారు 29 కుటుంబాల వారు జీవిస్తున్నారు. ఇటీవల కోర్టు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. గత ప్రభుత్వంలోనే 22 మంది బాధితులకు పట్టాలు ఇచ్చారు. తమకు ఇల్లు కట్టుకునే స్థోమత లేదని బాధితులు ఆక్రమణల నుంచి వైదొలగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్రమణలను ఖాళీ చేయించారు. ఆక్రమణదారులు ఆయా పంచల్లోనే కాలం గడుపుతున్నారు. తాము ఇల్లు నిర్మించుకునే స్థితిలో లేమని చెప్పడంతో ఆయా పట్టాలను వేరొకరికి మార్పు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. 30 ఏళ్లుగా వర్షాలు, ముంపు నీటిలోనే జీవనం గడిపామని, పాములు, క్రిమికీటకాలతో పాటు, శవ దహనాల ఎదురుగా భోజనాలు చేశామని, నిద్రపోయామని వాపోతున్నారు.

వీధి దీపాల కింద చదువులు : 29 బాధిత కుటుంబాల్లో సుమారు వంద మందికి పైగా ఉన్నారు. వారిలో సుమారు 25 నుంచి 30 మంది వరకు పిల్లలుండగా చాలా మంది ఆరు నుంచి పదో తరగతి చదువుతున్నవారే. వీరంతా గూడు లేక, చదువుకునేందుకు ఆస్కారం లేక వీధి దీపాల కింద చదువుకుంటూ కాలం గడుపుతున్నారు. ఒక పక్క దోమలు, మరో పక్క ఉక్కబెట్టే వాతావరణంలో అల్లాడిపోతున్నారు. రోడ్లపై పడుకుంటూ, వీధిలైట్ల వెలుగులో చదువుకుంటున్నా అధికారులకు, పాలకులకు కనికరం లేదని ఆవేదన చెందుతున్నారు. తమను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వస్తుందని ఆశించామని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా పట్టించుకోలేదని పిల్లలు, వృద్ధులు, మహిళలు వాపోతున్నారు. రెండు మూడు తరాల నుంచి ఇక్కడే జీవిస్తున్నామని, వైఎస్ జగన్ ప్రభుత్వంలో తమకు పట్టాలిచ్చారని చెబుతున్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు కూటమి ప్రభుత్వం రూ.4 లక్షలు ఇస్తానని ప్రకటించడంతో ఆశగా ఎదురు చూశామని, అవి కాస్తా ఆవిరయ్యాయని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా వీధి దీపాల కింద పిల్లలు చదువుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు స్థానిక పార్టీ నేతలను పంపించి విషయం బయటికి రాకుండా సద్దుమణిచే ప్రయత్నం చేయడం గమనార్హం

కొల్లేరులో ఆక్రమణదారులకు నోటీసులు

ఖండ్రిక కాలువ ప్రక్షాళనకు ప్రతిపాదనలు

సాక్షి స్పందన

నిడమర్రు: కొల్లేరు అభయారణ్య పరిధిలో అక్రమ ఆక్వా సాగుపై శనివారం 'సాక్షి'లో ప్రచురించిన 'కొల్లేరు అభయారణ్యం.. ఆక్రమణలే సర్వం' శీర్షికన కథనానికి జిల్లా అటవీ శాఖ అధికారులు స్పందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి (వన్యప్రాణి యాజమాన్యం) డి.విజయ దేవరగోపవరంలో 5వ కాంటూరులోపు అక్రమ సాగు చేస్తున్న ఆక్వా చెరువులు, విద్యుత్ తీగలు, బోర్లను పరిశీలించారు. బహిరంగంగా విద్యుత్ తీగలు కనిపిస్తున్నా ఏం చేస్తున్నారని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేస్తామని సిబ్బందిపై ఆమె మండిపడ్డారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు రైతులతో మాట్లాడారు. పెదనిండ్రకొలను నుంచి దేవరగోవపరం మీదుగా కొల్లేరులో కలిసేలా 2.5 కిలోమీటర్ల మేర ఖండ్రిక పంట కాలువ రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పెదనిండ్రకొలను గ్రామ పరిధిలో కాలువ ఆక్రమణలు లేవని, దేవరగోపవరం 5వ కాంటూరు పరిధి నుంచి ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారించారు. సుమారు కిలోమీటరు మేర ఖండ్రిక పంట కాలువ తొమ్మిది ఆక్వా చెరువుల మధ్యలో ఉన్నట్టు గుర్తించారు. ఆయా చెరువుల నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్నట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఆక్రమిత పంట కాలువ 5వ కాంటూరు పరిధిలో ఉండటంతో కాలువ ప్రక్షాళనకు ప్రభుత్వ అనుమతి కోరడంతో పాటు కాలువ తవ్వేందుకు ఇరిగేషన్ శాఖ ప్రతిపాదించిన రూ.11.80 లక్షల నిధులు మంజూరు చేసేలా నివేదిక పంపుతామన్నారు. ఏలూరు రేంజర్ అధికారి మోహిని విజయలక్ష్మి, అటవీ సిబ్బంది ఉన్నారు.



దేవరగోపవరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ విజయ, తహసీల్దార్ నాగరాజు

స్వచ్ఛ ఆంధ్రలో భాగం కండి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ వాడకూడదని, రోడ్లపై చెత్త వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయాల వద్ద వ్యర్థాలను రీసైక్లింగ్ చేసుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ఐక్య నగర్‌లోని హౌసింగ్ కాలనీలో పార్కును రూ.30 లక్షలతో అభివృద్ధి చేసేందుకు దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్ ముందుకు వచ్చిందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం రూరల్: చేతి వృత్తిదారులను కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో ఈపీసీహెచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హస్త కళాకృతులకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ కల్పించేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. నరసాపురం ప్రాంత లేసు అల్లికలకు ప్రపంచ గుర్తింపు ఉందన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఈపీసీహెచ్ ఎక్స్ చైర్మన్ ఆర్కే పస్సి, ఈడీ ఆర్కే వర్మ పాల్గొన్నారు.


కోకో కొనుగోలు కోసం ధర్నాలు



కోకో కాయలను చూపుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కోకో గింజలు కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24, 25 తేదీల్లో మండలాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించనున్నట్టు కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. చొదిమెళ్లలో నాయకులు శనివారం పర్యటించారు. ధర్నా, రాస్తారోకోలను జయప్రదం చేయాలని రైతులను కోరారు. కోకో గింజల కొనుగోలు, ధరల సమస్యలపై ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినా కోకో రైతులకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. సంఘ నాయకులు కోనేరు సతీష్‌బాబు, పి.నాని, పి.సుధాకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు వచ్చేనెల మొదటి వారంలో కేంద్రాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లు, పీజీఆర్ఎస్, రీసర్వే, రెవెన్యూ సదస్సులు, వెబ్ ల్యాండ్, ఏపీ సేవా సర్వీసులు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ధాన్యం కొనుగోలుకు సిబ్బందిని నియమించి, మూడు విడతల శిక్షణ ఇవ్వాలన్నారు. గోనె సంచులు, రవాణాకు వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో వాట్సాప్ చాట్‌ను ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతు సేవా కేంద్రాల, మిల్లులు వద్ద ఒకే కంపెనీకి చెందిన తేమశాతం యంత్రాలు ఉండేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 120 గ్రామాల్లో సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.

బదిలీల చట్టం ఏకపక్షం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం అవమానించడమే అని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ పాయింట్ ఏడాదికి ఒకటి కావాలని అడిగినా 0.5 మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. రిటైర్మెంట్‌కు మూడేళ్ల సర్వీస్ ఉన్నవారికి బదిలీల నుంచి మినహాయించాలని కోరినా అధికారులు రెండేళ్లు ఉన్నవారికి మాత్రమే మినహాయింపు ఇచ్చారన్నారు. జీఓ 117 రద్దుతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు దాదాపు 10 వేలు మిగులు చూపుతారని, అలాంటప్పుడు ఎస్జీటీలకు పదోన్నతులు ఎక్కడ కల్పిస్తారని ప్రశ్నించారు. పలు ప్రాథమిక పాఠశాలల మూతకు రంగం సిద్ధమైందని, భవిష్యత్తులో ఎస్జీటీ టీచర్ల నియామకం కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 117 రద్దుతో అపకారమే ఎక్కువగా జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

హోరాహోరీగా ఆశీలు వేలం



ఆకివీడు నగర పంచాయతీ ఆవరణలో ఆశీలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు : ఆకివీడు నగర పంచాయతీ ఆశీలు వేలం పాట శనివారం హోరాహోరీగా సాగింది. నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ పర్యవేక్షణలో వేలం పాట కొనసాగింది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు వేలం పాటలో పాల్గొన్నారు. డైలీ మార్కెట్ వేలం పాటను మోటుపల్లి శ్రీధర్ రూ.1,01,01,006కు దక్కించుకున్నారు. వారపు సంత ఆశీలు వసూళ్లను షేక్ అమీర్ రూ.3,30,200కు, కబేళా పాటను షేక్ చంటి సాహెబ్ రూ.35,500కు దక్కించుకున్నట్లు కమిషనర్ కృష్ణమోహన్ చెప్పారు. గత ఏడాది డైలీ మార్కెట్ వేలం పాట ధర కంటే ఈ ఏడాది రూ.20 లక్షలకు పైగా ఆదాయం లభించింది.

రూ.1.01 కోట్లకు మార్కెట్ వేలం పాట

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీ పరిధిలో 2025–2026 ఏడాదికి మార్కెట్ పన్ను వసూళ్లకు శనివారం భీమవరం మున్సిపాలిటీలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో హెచ్చు పాటగా రూ.1,01,49,070కు యాత్ర వెంకటేష్ పాడుకున్నారు. గతేడాది వేలంలో రూ.95.68 లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.5.42 లక్షల ఆదాయం పెరిగింది. వేలం పాటను అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు నిర్వహించారు.

నిషేధిత మందులు.. యథేచ్ఛగా అమ్మకాలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిషేధిత మందుల అక్రమాలపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. పక్కా సమాచారంతో ఏకకాలంలో దాడులు చేయగా.. ఊహించని స్థాయిలో అక్రమాలు వెలుగుచూశాయి. లైంగిక సామార్థ్యాన్ని పెంచే మందులు, గర్భవిచ్ఛిత్తి, మత్తు కలిగించే మందులు పెద్ద మొత్తంలో పట్టుబడ్డాయి.

- జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ అధికారుల దాడులు
- లైంగిక సామర్థ్యం పెంచే మందులు భారీ ఎత్తున సీజ్
- కాలం చెల్లిన మందులపై స్టిక్కర్లు అంటించి విక్రయాలు





నిషేధిత మందులు చూపిస్తున్న విజిలెన్స్ ఎస్సై



తణుకులో నిషేధిత మందులు నిల్వ ఉంచిన భవనం

తణుకు అర్బన్: జిల్లాలో పలు మందుల దుకాణాల్లో నిషేధిక డ్రగ్స్ అమ్ముతున్నారనే సమాచారంతో జరిపిన దాడుల్లో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూశాయి. ఈ నెల 21న తణుకు నియోజకవర్గంలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించగా.. నిషేధిత మందులతో పాటు.. కాలం చెల్లిన మందులకు స్టిక్కర్లు అంటించి అమ్ముతున్న వైనం వెలుగుచూసింది. ఈ నిషేధిత మందుల్లో లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందులతోపాటు మత్తు కలిగించేవి, గర్భస్రావం మందులున్నాయి. తణుకు నియోజకవర్గంలోని అత్తిలిలో సత్యకృష్ణ మందుల దుకాణంలో నిషేధిత మందులతోపాటు కాలం చెల్లిన మందుల నిల్వను అధికారులు కనుగొన్నారు. ఈ దుకాణాన్ని మూసివేసి లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేశారు. తణుకులోని తంగిరాల వారివీధిలో పెంజర్ల నాగేశ్వరరావు కొంతకాలంగా నిషేధిత మందుల్ని రావులపాలెం నుంచి కొని స్థానికంగా అధిక ధరలకు అమ్మడాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి దాడి చేసి పట్టుకున్నారు. అధిక శాతం లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందుల విక్రయాలు తణుకు పరిసర ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నాయని విక్రయదారుడు తెలపడం విశేషం. నాగేశ్వరరావు తణుకులోని పలు దుకాణాలకు ఈ మందులు సరఫరా చేస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, ఏలూరులో పలు దుకాణాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిషేధిత మందుల విక్రయాలకు సంబంధించి రూ.కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. నరసాపురం డివిజన్‌లో సుమారుగా 800, భీమవరం డివిజన్‌లో 600కు పైగా మందుల దుకాణాలు ఉన్నాయి., కొన్ని దుకాణాల్లో నిషేధిత మందులు విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాడుల విషయం తెలియడంతో అక్రమార్కులు జాగ్రత్త పడిపోయారు. తణుకులో ఒక ఇంట్లో నిషేధిత మందులు విక్రయాలకు సంబంధించి సుమారు రూ.6 లక్షల వరకు మందులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. రావులపాలెంకు చెందిన బచ్చు సుబ్బారావు బ్యాంకు ఖాతాకు ఫోన్ పే ద్వారా పంపినట్లు విజిలెన్స్ అధికారులు ఆధారాలు సేకరించారు.

నిషేధిత మందులతో ఆరోగ్యంపై ప్రభావం

లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందుల వల్ల గుండెకు రక్తం సరఫరా చేసే ధమనులు, ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ మందు అధిక వాడకం వల్ల హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం పొంచి ఉంటుంది. గర్భస్రావం కోసం ఉపయోగించే మందులు ఒక్కోసారి ప్రాణాల మీదకు తెస్తాయని, భవిష్యత్తులో తీవ్రం ప్రభావం చూపిస్తాయని చెబుతున్నారు. మత్తు మందు వాడకంతో కొన్నాళ్లకు నరాల సమస్యలు, నిద్రలేమి సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఔషధ నియంత్రణ శాఖ నిర్లక్ష్యం

విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగితే తప్ప నిషేధిత మందుల వినియోగంపై ఔషధ నియంత్రణ శాఖ పర్యవేక్షణ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ దుకాణంలో ఏ మందులు ఉన్నాయి.. ఏ దుకాణంలో నిబంధనలు పాటిస్తున్నారనే విషయంపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు స్పష్టత ఉంటుంది. కొన్ని రకాల కారణాలతో దాడులు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఔషధ నియంత్రణ శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించి తరచూ దుకాణాలపై దాడులు చేస్తే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

ఏలూరులో అమానుషం

బాలికపై వ్యక్తి అకృత్యాలు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. ఆరున్నరేళ్ల బాలికపై ఒక వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. డీఎస్పీ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు సిబ్బందితో వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వివాహితకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. భర్త నుంచి విడిపోయి దూరంగా ఉంటోంది. ఆమెతో నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న పోతుల వంశీ మహేష్ వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. అతను ఇంట్లో ఉంటున్నప్పుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆ మహిళకు అనుమానం వచ్చింది. ఆమె బయటకు వెళ్తూ.. తన సెల్‌ఫోన్‌లో వీడియో కెమెరా ఆన్ చేసి ఉంచింది. బయట నుంచి వచ్చి మొబైల్ చూడగా అతని ఘోరం వీడియోలో రికార్డయింది. వెంటనే స్థానికులకు తెలపగా అతడిని ఇంట్లో పెట్టి తలుపులకు తాళం వేశారు. ఏలూరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం నిందితుడిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో అరెస్టు

భీమవరం: వివాహితపై అత్యాచారం కేసులో భీమవరం వన్‌టౌన్‌లోని ఇండస్ట్రీ ఏరియాకు చెందిన ములపర్తి అప్పలస్వామిని శనివారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన వివాహితపై ఈనెల 20న అత్యాచారం చేయడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ చెప్పారు.

ఏరులై పారుతున్న మద్యం

- 899 కేసుల్లో 799 మంది అరెస్ట్
- బెల్టు షాపులపై 345 కేసులు



బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



మద్యం అక్రమ విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం ఏరులై పారుతోంది. ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా.. మద్యం అక్రమ విక్రయాలను నియంత్రించలేపోతున్నారు. మరో వైపు కూటమి నేతల సాయంతో బెల్టు షాపుల ఏర్పాటు చేసి జోరుగా విక్రయాలు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో 2025 జనవరి 1 నుంచి మార్చి 15 వరకు అక్రమ అమ్మకాలపై ఏకంగా 899 కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 144 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలపై భారీగా కేసులు నమోదయ్యాయి. 315 ఐడీ కేసుల్లో 324 మంది, 157 బెల్లపు ఊట కేసుల్లో 44 మంది, 345 బెల్టు షాపులపై కేసుల్లో 348 మంది, 50 ఎన్‌డీపీఎల్ కేసుల్లో 51 మంది, 28 ఇతర కేసుల్లో 28 మందిపై కేసులు నమోదు చేశారు. 42 వాహనాలను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు.

ఏడు ఎక్సైజ్ సర్కిళ్లలో ఇలా..

జిల్లాలోని ఏడు సర్కిళ్ల పరిధిలో భీమడోలు, ఏలూరు సర్కిళ్లలో తక్కువ కేసులు నమోదయ్యాయి. చింతలపూడి సర్కిల్‌లో 256 కేసులు నమోదు చేశారు. నూజివీడు సర్కిల్‌లో 203 కేసులు, జంగారెడ్డిగూడెం సర్కిల్‌లో 124 కేసులు, పోలవరం 121, కైకలూరు సర్కిల్లో 77 కేసులు నమోదు చేశారు. బెల్టుషాపుల విషయానికొస్తే కైకలూరులో 70, నూజివీడు 50, చింతలపూడి సర్కిల్ పరిధిలో 52 కేసులు నమోదు చేశారు. బెల్లపుఊటకు సంబంధించి చింతలపూడిలో 52 కేసుల్లో 59 వేల లీటర్లు ధ్వంసం చేయగా.. పోలవరం సర్కిల్‌లో 47,800 లీటర్లు, నూజివీడు సర్కిల్‌లో 45,310 లీటర్లు, జంగారెడ్డిగూడెం సర్కిల్‌లో 15,320 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. చింతలపూడి పరిధిలో 15 వాహనాలు, నూజివీడులో 16 వాహనాలు, పోలవరం 6, జంగారెడ్డిగూడెం 4, ఏలూరులో ఒక్క వాహనాన్ని సీజ్ చేశారు.

నిబంధనలు పాటించాలి

అక్రమంగా మద్యం విక్రయించినా.. నిబంధనలు పాటించకపోయినా కేసులు నమోదు చేస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాలు, గ్రామాల్లో సారా తయారీపై నిఘా ఉంచి దాడులు చేస్తున్నాం. మూడు నెలల్లో భారీగా కేసులు నమోదు చేశాం.

– ఆవులయ్య, ఎక్సైజ్ అధికారి, ఏలూరు

వీధి కుక్కలకు ఆపరేషన్లు

- తాడేపల్లిగూడెంలో ప్రత్యేక కేంద్రం
- కుటుంబ నియంత్రణ, స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సల నిర్వహణ



తాడేపల్లిగూడెంలోని సెంటరులో కుక్కల కోసం బోన్లు



స్టోర్ రూం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 12వ వార్డు పాతూరు సచివాలయం సమీపంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ, స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ టీకాలు వేసేందుకు ప్రత్యేక కేంద్రాన్ని నిర్మించారు. తాడేపల్లిగూడెం, తణుకు పరిధిలో కుక్కలకు ఇక్కడ ఆపరేషన్లు చేస్తారు. రూ.18 లక్షలతో నిర్మించిన ఈ కేంద్రంలో కుక్కలకు ఆపరేషన్ చేసేందుకు ఆపరేషన్ థియేటర్, డాక్టర్ రూం, స్టోర్ రూం, స్టెరిలైజేషన్, హీటర్ రూంలతో పాటు కుక్కలను ఉంచేందుకు 37 బోనులు అందుబాటులో ఉంచారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఏజెన్సీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వెటర్నరీ వైద్యులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో స్నేహ సిబ్బంది ఆపరేషన్ చేసే ముందురోజు కుక్కలను పట్టుకుని బోనులోకి తరలిస్తారు. తరువాత రోజు డాక్టర్, సహాయకుల పర్యవేక్షణలో ఆపరేషన్లు చేస్తారు. అబ్జర్వేషన్ కోసం మూడు రోజులు కుక్కను బోనులో ఉంచుతారు. ఈ సమయంలో వాటికి అవసరమైన ఆహారం, మంచినీరు అందజేస్తారు. సెంటరులో ఎలాంటి దుర్వాసన రాకుండా శానిటేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. కోలుకున్న తరువాత కుక్కలను ఎక్కడ పట్టుకున్నారో అక్కడే వదిలేస్తారు. కుక్కకు రూ.1500 చొప్పున ఏజెన్సీకి ప్రభుత్వం ఇస్తుంది. మున్సిపల్ డీఈ నాగిరెడ్డి రామారావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో 35 వార్డులలో 1,150 కుక్కలకు, తణుకు మున్సిపాలిటీ పరిధిలో 500 కుక్కలకు ఈ ఆపరేషన్లు చేస్తారన్నారు. ఇప్పటికే పట్టణంలో 450 కుక్కలకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందజేసినట్లు చెప్పారు. నిరంతరం వ్యాక్సినేషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

కుక్కల సంతతి తగ్గేనా...

తాడేపల్లిగూడెం పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో కుక్కలకు ఆపరేషన్లు చేయడం ద్వారా వాటి సంతతి తగ్గుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

గోదావరి మీదుగా గంజాయి తరలింపు

కుక్కునూరు: మండలంలోని వింజరం రేవు నుంచి గోదావరి మీదుగా గంజాయిని దాటించి రోడ్డు మార్గంలో తరలిస్తుండగా, శనివారం బూర్గంపాడు వద్ద తెలంగాణ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. తెలంగాణ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం వాంకుడోతు సాయికుమార్, యడముత్యం వంశీ, షేక్ మున్వర్, రమేష్, కర్నాల సురేష్, జగదీష్, స్వరూప్, యల్లాజి, సురేష్‌లు ఒడిశా నుంచి 120 కిలోల గంజాయిని అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక నుంచి మండలంలోని వింజరం రేవుకు తీసుకువచ్చి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తెలంగాణకు తరలిస్తుండగా బూర్గంపాడు ఎస్సై పట్టుకున్నారు. వింజరం రేవులో యల్లాజి అనే వ్యక్తి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో మండలం మీదుగా గంజాయిని తెలంగాణ తరలిస్తుండగా, అశ్వారావుపేట పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

డీఏ ఎరియర్లు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన డీఏ ఎరియర్లు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బకాయిలు రూ. 6200 కోట్లు చెల్లించాలని నిర్ణయించటం హర్షణీయమని.. ఉద్యోగుల నుంచి మినహాయించిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ డబ్బులు, సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్, సరెండర్ లీవ్ బకాయిలను మాత్రమే చెల్లించి బకాయిలు చెల్లించామంటే సరిపోదన్నారు. ఇంతవరకు నిధి పోర్టల్‌లో ఒక్క ఎరియర్ బిల్ ఎనేబుల్ చేయలేదని, ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



భీమడోలులో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

భీమడోలు : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానపర్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం రాత్రి దళిత నాయకులు కొవ్వొత్తులు పట్టుకుని నిరసన తెలిపారు. తొలుత భీమడోలు సంత మార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకుల పైడిమాల యుగంధర్, తుమ్మల శాంతభూషణం, గోగులమూడి రవికుమార్, మద్దాల వెంకటరత్నం, కాలి కిరణ్, రత్తయ్య, బెంజిమన్, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో..

ఏలూరు (టూటౌన్): అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో శనివారం రాత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్‌ను అవమానించడం విచారించదగ్గ విషయం అన్నారు. దూబచర్ల వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. నాయకులు ఎస్.కార్తీక్, బి.నాగరాజు, పాము మాన్‌సింగ్, అంబటి నాగేంద్ర, కె.మురళీ తదితరులు ఈ ఘటనను ఖండించారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడంపై పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ తీవ్రంగా ఖండించారు. 48 గంటల్లో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా పొట్ల సురేష్ ఏకగ్రీవం


పొట్ల సురేష్

తణుకు అర్బన్: ఈనెల 28 తేదీన నిర్వహించనున్న బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా న్యాయవాది పొట్ల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ తరపున గతంలో చేసిన పలు కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని అసోసియేషన్ న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు సురేష్ తెలిపారు. నా ఎన్నికను ఏకగ్రీవం చేసినందుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

తణుకు పట్టణం మీదుగా తిరుపతి, హైదరాబాద్ బస్సులు


తణుకులో ప్రయాణికులతో మాట్లాడుతున్న డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: తణుకు పట్టణంమీదుగా ఆర్టీసీ తిరుపతి సర్వీసును ప్రయాణికులు సద్వినియోగపరచుకోవాలని డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ కోరారు. శనివారం తిరుపతి ఆర్టీసీ సర్వీస్ తణుకు పట్టణంలోని పాత బస్టాండ్, టౌన్‌హాల్ కాంప్లెక్స్, నరేంద్ర సెంటర్, కేశవ స్వామి టెంపుల్ సెంటర్, మహిళా కళాశాల, షర్మిష్ఠ సెంటర్ జంక్షన్ మీదుగా వెళ్లే బస్సులో ప్రయాణించిన ఆయన ప్రయాణికులతో మాట్లాడారు. పట్టణ ప్రాంతంలో ఇటీవల నూతనంగా నిర్దేశించిన బస్ స్టాప్‌లలో తిరుపతి వెళ్లేందుకు ఎక్కిన ప్రయాణికులకు ధన్యవాదాలు తెలిపారు. తణుకు డిపో నుంచి హైదరాబాద్ వెళ్లే సర్వీసులు కూడా తణుకు పట్టణం మీదుగానే వెళ్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం చేసి తణుకు ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న లాజర్ తదితరులు

తణుకు అర్బన్: ఎస్సీ వర్గీకరణకు చట్టం చేస్తూ ఈనెల 20వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి లాజర్ అబ్బదాసరి అన్నారు. తణుకు పాతవూరులో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మాదిగ ఉపకులాల భావితరాల భవిష్యత్తుకు బాటవేశారని అన్నారు. మాదిగ జాతి ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ ఉద్యమానికి విజయంగా భావిస్తున్నామని అన్నారు. బీజేపీ ఎస్సీమోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు ముప్పిడి సుబ్బయ్య, నాయకులు కొడమంచిలి జితేంద్ర, జొన్నాడ సత్యనారాయణ, బోడిమి శేఖర్, అబ్బదాసరి సోలేమాన్, ఉండ్రాజవరపు శ్రీను, అబ్బదాసరి కల్యాణ్, ఉండ్రాజవరపు నరసింహమూర్తి, నేకూరి కృష్ణ పాల్గొన్నారు.

కుంచనపల్లి సమ్మర్ స్టోరేజ్ పనుల పరిశీలన


కుంచనపల్లి వద్ద జరుగుతున్న రెండవ సమ్మర్ స్టోరేజ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పనులను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆయన సూచించారు.

అప్పుడే బాగుంది..

- సంక్షేమ పండుగ చేసిన జగన్ ప్రభుత్వం
- తణుకు నియోజకవర్గంలో రూ. 3300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- సూపర్ సిక్స్ కూడా అమలు చేయలేని కూటమి ప్రభుత్వం
- బహిరంగంగానే విమర్శిస్తున్న ప్రజానీకం


తణుకులో సంక్షేమ పథకం చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: గత ఐదేళ్లపాటు సంక్షేమం పరవళ్లు రుచిచూసిన ప్రజానీకం నేడు జగన్ ఉంటేనా.. అనే నానుడితో రోజులు వెళ్లదీస్తున్నారు. ఐదేళ్లపాటు అర్హులైన అన్ని వర్గాలకు సంక్షేమం అందజేసి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజానీకం మననం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజానీకం తీవ్ర నిరసనను బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వకపోవడంతో ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అమ్మ ఒడి పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 15వేలు ఇవ్వగా, కూటమి ప్రభుత్వం అదే పథకానికి తల్లికి వందనం పేరు పెట్టి ఎంతమంది పిల్లలుంటే అన్ని రూ. 15వేలు ఇస్తామని బాకాలు ఊది మరీ చెప్పారు. కానీ ఇంత వరకు అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నలుగురు కలిస్తే చాలు జగన్ ఉంటేనా అనే మాట ప్రతి ఒక్కరి నోటా వినిపించడం జగన్ చరిష్మా ఏంటో తెలుస్తోంది. గత ఐదేళ్ల కాలంలో తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి రూ. 3300 కోట్లుతో సంక్షేమం, అభివృద్ధికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాటుపడ్డారు.

క్యాలెండర్ ప్రకారం సంక్షేమం..

ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రజల కష్టాలను నేరుగా చూసి రూపొందించిన సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం క్యాలెండర్ ప్రకారం పూర్తిస్థాయిలో అమలు చేశారు. జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న వసతిదీవెన, జగనన్న విద్యాదీవెన, జగనన్న విదేశీ దీవెన, మత్స్యకార భరోసా, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ నేతన్ననేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ జలకళ, జగనన్న విద్యాకానుక, జగనన్న ట్యాబ్‌లు, జగనన్న కాలనీలు వంటి సంక్షేమం అర్హులందరి ఇంటి గుమ్మంలోకి నడిచివచ్చే పరిస్థితి ఉండేది. కానీ నేడు ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాల అమలకే కూటమి ప్రభుత్వం పురిటి నొప్పులు పడుతోందని ప్రజానీకం నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సంక్షేమం అంటే జగన్..



పేద ప్రజలందరికీ సంక్షేమం అందజేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి గుండెల్లో నిలిచారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమం అందజేసి చరిత్రలో నిలిచే పాలన అందించిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుంది. విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. పేద పిల్లలను చదివించాలంటూ అమ్మ ఒడి ద్వారా రూ. 15వేలు అందజేశారు. అంతేకాకుండా రూ. వెయ్యి ఖర్చుదాటితే ఆరోగ్యశ్రీని అమలుచేసే విధానం అందరికీ అండగా నిలిచింది.

– మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత..



జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి పేదలను ఆదుకున్నారు. గత ఐదేళ్లలో పేదింటి పిల్లలు ఖరీదైన విద్యనందుకుని ఉన్నత స్థాయికి చేరారు. ఎస్సీ వర్గాలకు ఉచిత విద్యుత్ అందించి వారిని కూడా ఆదుకున్నారు. ముఖ్యంగా పేదల సొంతింటి కలను నిజం చేస్తూ జగనన్న కాలనీల పేరుతో పట్టణంలో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేశారు. అర్హత ఉంటే చాలు సంక్షేమం ఇంటి గడపలోకి వచ్చే విధంగా పాలన అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

24న శ్రీరామ జపయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవం

అత్తిలి: ఈనెల 24వ తేదీన అత్తిలి టీటీడీ కల్యాణ మండపంలో హైందవి వారి ఆధ్వర్యంలో దేశ ధర్మములు రక్షణ, ఆలయాల పరిరక్షణ కోసం శ్రీరామ జపయజ్ఞం, పూర్ణాహుతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జపయజ్ఞ నిర్వహణ సమితి సభ్యులు వాడపల్లి సూర్యతేజ తెలిపారు. సోమవారం ఉదయం మండపారాధన, హోమాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో శివశక్తి అధ్యక్షుడు కరుణాకర్ సుగ్గుణ, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, కమలానంద భారతి స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ ఎస్ అనంతలక్ష్మి హాజరౌతారని తెలిపారు.

రంగస్థల కళాకారుల సభను విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 154వ నెలవారీ సత్కారాలు, సభ కార్యక్రమం పట్టణంలోని గీతా మందిరంలో ఈ నెల 24వ తేదీన సోమవారం రాత్రి నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబురావులు తెలిపారు. నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి–రాంబాబులకు గౌరవ సత్కారం, సినీ, టీవీ, నాటక రంగ హాస్య నటుడు జబర్దస్త్ అప్పారావుకు కళా పురస్కారం, ఆర్టీసీ ఉద్యోగి దొంతల విజయకుమార్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, రంగస్థల నటి జి.నాగమణికి ఆర్థిక సత్కారం చేస్తున్నట్లు తెలిపారు.

తణుకులో ట్రాన్స్‌జెండర్స్ నిరసన


తణుకు నరేంద్ర సెంటర్‌లో నిందితుడు బన్నీ ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న ట్రాన్స్‌జెండర్‌లు

తణుకు అర్బన్: అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపూ అత్యంత కిరాతకంగా నరికి చంపిన బన్నీని ఉరితీయాలని తణుకులో ట్రాన్స్ జెండర్స్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ నిహారిక నాయక్ మాట్లాడుతూ అనకాపల్లిలో 4 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన వ్యక్తి బన్నీ ట్రాన్స్‌జెండర్ దీపూను కత్తితో దాడిచేసి చంపిన తీరు భయానకరంగా ఉందని అన్నారు. పొట్టకూటికోసం మా వృత్తిలో రోడ్డుపైకి వచ్చి ఎన్నో అవమానాలు, వివక్షతో నిత్యం ఆవేదన చెందుతున్న మాపై ఈ దాడులను ఆపించాలని ప్రభుత్వాన్ని కోరారు. అందరి క్షేమం కోరుకుంటామే కానీ ఎవరికి ట్రాన్స్‌జెండర్‌లు అపకారం చేయరని స్పష్టం చేశారు. అనకాపల్లి ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు బాధ్యతగా వ్యవహరించి మాకు న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ట్రాన్స్ జెండర్స్‌పై ఎటువంటి అఘాయిత్యాలు, దాడులు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్స్ నలుపు రంగు వస్త్రాలు ధరించి తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నాకు దిగారు. అనంతరం రాష్ట్రపతి రోడ్డులో మృతిచెందిన ట్రాన్స్‌జెండర్ దీపూ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.

క్షయకు ఉచితంగా మందులు


మాట్లాడుతున్న డాక్టర్ సాంబశివరావు, ఇతర వైద్యులు, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్షయ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాధికి మందులు ఉన్నాయని, ఉచితంగా అందజేస్తామని ఆర్ఎంఓ డా.సాంబశివరావు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం మార్చి 24 సందర్భంగా నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులచే పట్టణంలో ర్యాలీ జరిగింది. సాంబశివరావు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి మందులు వాడితే సకాలంలో నయమవుతుందని, లేని పక్షంలో క్షయ వ్యాధి మొండి క్షయగా మారుతుందని, చికిత్స మరింత జటిలమవుతుందని, క్షయ వ్యాధి నిర్ధారణకు ఏరియా ఆసుపత్రిలో సీబీనాట్, ట్రూ నాట్ అధునాతనమైన పరికరాలు ఉన్నాయని, పరీక్షలు సులువుగా చేయవచ్చునన్నారు. ఏఆర్‌టీ డాక్టర్ ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వ్యాధిగ్రస్తులు, షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని, పౌష్టికాహారం కూడా ముఖ్యమని తెలిపారు. సీనియర్ వైద్యులు డాక్టర్లు సుబ్బారావు, కీర్తి, సూపర్‌వైజర్లు గిరిబాబు, కృష్ణ, నాగలక్ష్మి, నరేష్, రాఘువ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ సింధు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాన్సర్ పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్య నిపుణులు (ఏలూరు) డాక్టర్ బి.సింధు సూచించారు. ఏపీ నిట్‌లోని మహిళలకు బ్రెస్ క్యాన్సర్ పై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సింధు మాట్లాడుతూ క్యాన్సర్‌లో ఎన్నో రకాలు ఉన్నాయని, వాటిలో మహిళలకు అంతులేని భయానికి గురి చేస్తుంది బ్రెస్ట్ క్యాన్సర్ అన్నారు. ఈ బ్రెస్ట్ కాన్సర్ మహిళలకే కాకుండా మగ వారికి కూడా వస్తుందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే ఈ కాన్సర్ మహమ్మారిని మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చుని వెల్లడించారు. ఏపీ నిట్ వైద్యాధికారి డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ క్యాన్సర్ రకాలు, క్యాన్సర్ రావడానికి గల అంశాలు, వాటి లక్షణాలు, అధునిక చికిత్స విధానాలు తదితర విషయాలను చర్చించారు. మహిళలకు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సింధును ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమ బిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో నార్త్ 33/11కేవీ విద్యుత్ హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలోని రిలయన్స్ ఫీడర్, సత్యవతి నగర్ ఫీడర్‌లకు సంబంధించి ఆర్‌డీఎస్ఎస్ బిఫర్‌కేషన్ (విభజన) పనులు నిమిత్తం ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. హౌసింగ్ బోర్డు, శశి కళాశాల, ఎస్ఎస్ రాజు లేఅవుట్ ఏరియా, పాలిటెక్నిక్ కళాశాల, గాంధీ బొమ్మ సెంటర, గణేష్ నగర్, ఏరియా ఆసుపత్రి ఏరియా, సత్యవతినగర్, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణంలో సౌత్ సబ్ స్టేషన్ పరిధిలో..

సౌత్ సబ్ స్టేషన్ (భాగ్యలక్ష్మిపేట) పరిధిలో 33/11 కేవీ జువ్వలపాలెం ఎస్ఎస్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ వైర్లుకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించేందుకు ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. జువ్వలపాలెం, సవిత్రుపేట, తణుకు బైపాస్ రోడ్డు, మార్కెట్ ఏరియా, కొత్తగూడెం, నవ్వారుపేట, ఏలూరు రోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


లింగారాయుడిగూడెం గ్రామంలో జరిగిన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లింగారాయుడిగూడెం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పార్టీ ఆదేశానుసారం ముందుకు సాగాలన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ గ్రామాన కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా కాసాని శ్రీరామచంద్రమూర్తి, తాడికొండ శ్రీను, అయినం వీర ఆంజనేయులు, వీరమళ్ల వరప్రసాద్, వెలగన రాము, మైనం శ్రీను, కాసాని శ్రీను, మైనం లక్ష్మణ్‌కుమార్, వీరమళ్ల రామరాజు, మైనం లక్ష్మణ్‌లను నియమించారు. కనుపూరి ఉదయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నాయకులు సిర్రాపు శాంతకుమార్, దండే గోతియ్య పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెంటపాడు: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని, జగనన్న పాలనలోనే రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉండేదని ప్రజలు చెబుతున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం తనను కలిసిన పెంటపాడు పార్టీ నాయకులతో ఆయన మాట్లాడారు. పూర్వ వైభవం దిశగా పార్టీ అడుగులు వేయాలని కొట్టు సత్యనారాయణ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఇటీవల కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు మండలంలో పలువురికి పార్టీ పదవులు దక్కాయి. ఈ సందర్భంగా పెంటపాడు మండల నాయకులు కొట్టు సత్యనారాయను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను విస్మరించకుండా వచ్చే ఎన్నికలలో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసేందుకు పాటు పడతామన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల పార్టీ పదవులు పొందిన ఉపాధ్యక్షుడు కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బర్ల జయరాంబాబు, దేవాబత్తుల వెంకన్న బాబు, మండల కార్యవర్గ సభ్యుడిగా జామి కృష్ణ, మండల యూత్ అధ్యక్షునిగా నల్లమిల్లి అప్పిరెడ్డిలను కేంద్రకమిటీ నియమించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సలుమూరి ప్రకాష్, బండారు రాంబాబు, కొలుపూరి శివకిరణ్, ఉండ్రాజవరపు రాజు, రెడ్డి శ్రీను తదతరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షలు నియోజకవర్గంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. పట్టణం రూరల్, పెంటపాడు మండలంలో శనివారం కాంపోజిట్ తెలుగుకు సంబంధించిన సంస్కృతం పరీక్ష 30 మార్కులకు విద్యార్థులు రాశారు. 749 మంది విద్యార్థులకు గాను 736 మంది పరీక్ష రాశారు. 13 మంది పరీక్ష రాయలేదు.

శ్రీవాసవిలో ముగిసిన టెక్ యుఫోరియా 2కే25


శ్రీ వాసవిలో విద్యార్థులచే నృత్యాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న సాంకేతికోత్సవం టెక్ యుఫోరియా 2కే25 శనివారంతో ముగిసింది. శ్రీ వాసవి కళాశాలతో పాటు ఇతర కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఉల్లాసభరితమైన నృత్యాలతో అద్భుత ప్రదర్శనలతో అందరిని అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు విద్యార్థులను ఉత్సాహపరిచాయి. నటుడు రవితేజసాయి, గాయకుడు నజీరుద్దీన్‌లు అతిధిలుగా హాజరై విద్యార్థులతో ఆడి పాడి అలరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, సుబ్బారావులు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలకాశయ్య, పాబోలు వెంకటేశ్వరరావు, చక్కా అప్పారావు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ భాస్కర్‌రాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత నేరస్తులపై బైండోవర్ కేసులు


మేజిస్ట్రేట్ సీతారత్నం ఎదుట పాత నేరస్తులను హాజరుపర్చిన ఎక్సైజ్ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో పట్టుబడిన ఏడుగురిని శనివారం పెంటపాడు మండల మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఏడాది కాలానికి గాను రూ.1.50లక్షలు బాండ్ విలువకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే పెనాల్టీ విధించి ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామన్నారు. అక్రమ మద్యం విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్య ద్వారా ఉన్నత శిఖరాలు సాధించాలి


తణుకులో డాక్టర్ ఉషారాణిని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శనివారం సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులచే వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సి.వెంకట ఉషారాణి మాట్లాడుతూ విద్యాభ్యాసంలో ప్రతి విద్యార్థి ముందుగా పాజిటివ్ దృక్పథాన్ని అలవరచుకోవాలని కోరారు. విద్యతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలకు పాటిస్తూ ఉన్నతస్థాయికి చేరితే అదే అధ్యాపకుల గురుదక్షిణ అవుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అందుకునే పరిస్థితులు నేడు సమాజంలో ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ఇష్టంగా చదవాలని కోరారు. అనంతరం డాక్టర్ ఉషారాణిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీ సుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో చిట్టూరి రీనాసాయి, కోశాధికారి నందిగం సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం


తణుకు సబ్‌జైలులో ముద్దాయిలకు పెట్టే ఆహారాన్ని రుచిచూస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ఇన్‌చార్జ్ జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఏలూరు సెక్రటరీ కె. రత్న ప్రసాద్ శనివారం తణుకు సబ్‌జైల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహారం, వసతి, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వివిధ కేసుల్లో రిమాండ్‌లో వచ్చిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ముద్దాయిల్లో ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోతే వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తప్పు చేసినప్పటికీ నేరం తెలియదంటే చట్టం ఊరుకోదని కష్టపడకుండా అక్రమంగా డబ్బు సంపాదనకు పాల్పడడం నేరమని హెచ్చరించారు. ముద్దాయిలంతా భవిష్యత్తులో నేర ప్రవృత్తికి తావులేకుండా నడచుకోవాలని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసుకోవాలని సూచించారు. నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, సీనియర్ సివిల్ జడ్జి కె. కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పాతర్లంక, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

భీమరాజుకు ఘననివాళులు


తణుకులో కలిదిండి భీమరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భీమారావు తదితరులు

తణుకు అర్బన్: కార్మిక హక్కుల సాధనకు వారి అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన గొప్ప కార్మికోద్యమ నేత కలిదిండి భీమరాజు ఆశయసాధనకు కృషి చేయాలని ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. కార్మికోద్యమ నేత కలిదిండి భీమరాజు 8వ వర్ధంతి సందర్భంగా శనివారం తణుకు అక్కమాంబ టెక్స్ టైల్స్ కార్మిక సంఘ కార్యాలయం వద్ద భీమరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ అక్కమాంబ టెక్స్ టైల్స్ కార్యదర్శి వి.అనంత విక్రమరావు, సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడు సుంకవల్లి శ్రీరామారావు, దేవ పెద్దిరాజు, చిలుకూరి వెంకటేశ్వరరావు, గోపాలం, కదలి వెంకటేశ్వరరావు, నరశింహారావు, డి.శ్రీనివాస్, మాణిక్యాలరావు, దాసరి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు 25 వరకు గడువు పెంపు

అత్తిలి: వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎంపీడీవో పి శామ్యూల్ శనివారం తెలిపారు.